క్లుప్తంగా

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

రేపల్లె రూరల్: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ చంద్రావతి తెలిపారు. పట్టణానికి చెందిన 17 సంవత్సరాల బాలిక స్థానికంగా ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతోందన్నారు. ఈ నెల 18న కళాశాలకు వెళ్లిన ఆ బాలిక ఇంటికి తిరిగి రాకపోవటంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల వద్ద విచారించగా ఆచూకీ లభించలేదన్నారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేపు గీతాజ్ఞాన కర్పూర యజ్ఞం

భట్టిప్రోలు: స్థానిక సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో గురువారం చతుర్మాస్య వ్రత దీక్ష సమాప్తం, 243వ గీతాజ్ఞాన కర్పూర యజ్ఞం నిర్వహించనున్నట్లు సాధన మండలి అధ్యక్షురాలు బూర్లె అరుణ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా రుషికేష్‌కు చెందిన స్వామి భాస్కరానంద సరస్వతి విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు మధ్యాహ్నం దీపోత్సవం, సమారాధన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

విధుల నుంచి గ్రామ వలంటీర్ తొలగింపు

చదలవాడ: గ్రామ సచివాలయం వలంటీర్‌ని.. సక్రమంగా పనిచేయడం లేదని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో విధుల నుంచి తొలగించడం జరిగిందని పంచాయతీ కార్యదర్శి షేక్ షదిక్ అలీ మంగళవారం తెలిపారు. మండలంలోని చదలవాడ గ్రామం వలంటీర్ బొల్లిముంత విజయలక్ష్మి విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని గ్రామస్తులు పలుమార్లు ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. ఫిర్యాదులపై విచారణ చేసి, విధుల నుంచి తొలగించడం జరిగిందని ఆయన తెలిపారు.

మహా ధర్నాను విజయవంతం చేయాలి



కర్లపాలెం: కార్మిక వ్యతిరేక విధానాలను సాగిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 27, 28వ తేదీలలో విజయవాడలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగే మహా ధర్నాను విజయవంతం చయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శ్యామ్యూల్ కోరారు. కర్లపాలెంలో ఏఐటీయూసీ నియోజక వర్గ అధ్యక్షుడు సన్నమూరి శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం కార్మికుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నాయకులు బత్తుల అశోక్, షబ్బీర్ అలీ, జిలానీ, పిట్టు కాసులరెడ్డి, శ్రీనివాసరావు ఉన్నారు.

నేడు సుందరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

పదమటిపాలెం(భట్టిప్రోలు): కోనేటిపురం పంచాయతీ పరిధిలోని పదమటిపాలెంలో కొలువైన సుందరాంజనేయ స్వామి ఆలయ 15వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు దేవాలయ మేనేజింగ్ ట్రస్టీ, విశ్రాంత ఐఎఎస్ అధికారి పదమటి సుందరకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశేష పూజలు, హనుమత్ కల్యాణం, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పక్కా గృహాలు నిర్మించుకోవాలి



బొమ్మువానిపాలెం(కొల్లిపర): గ్రామాల్లో అర్హత ఉన్న వారు ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకం ద్వారా పక్కా గృహాలు నిర్మించుకోవాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మువానిపాలెం గ్రామంలో ఆవాస్ దివస్, ఆవాస్ సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా పీఎంఏవై(యూ) గ్రామీణ పథకం గురించి అవగాన కల్పించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ సుబ్బారావు ప్రజలకు గ్రామీణ పథకం అర్హతలు, స్టేజీవైజ్ పేమెంట్ వివరించి, లబ్ధిదారులు అడిగిన పలు సందేహాలు గురించి పూర్తి స్థాయిలో వివరించారు. అనంతరం పథకం కింద అర్హత ఉన్న లబ్ధిదారుల పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లి రజని, ఎంపీటీసీ తుమాటి భీమరాణి, ఎంపీడీవో వి.విజయలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కె.శంకర య్య, బొమ్ము శ్రీనివాసరెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, అన్నవరపులంక సర్పంచ్ తోడేటి రాజేశ్వరి, దాసు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ స్వాధీనం

చందోలు(కర్లపాలెం): ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక, మట్టి తరలించే వారిపై కఠిన చర్యలు తీసకుంటామని చందోలు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా రహదారిపై ఇసుక తరలిస్తున్న లారీని గుర్తించి సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఆయన మంగళవారం తెలిపారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్ ధ్యేయం



మోర్లవారిపాలెం పంచాయతీలో క్యాలెండర్ ఆవిష్కరణ



పల్లెకోనలో ఇంటింటికీ ప్రచారంలో ప్రజాప్రతినిధులు

ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: పేదల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగన్ పరిపాలన చేస్తున్నారని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సచివాలయంలో వెల్ఫేర్ బోర్డును ఆవిష్కరించి అక్కడ జరిగిన సభలో మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికలలో ఇచ్చిన హామీలు నెరవర్చటం వల్ల పేద ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయన్నారు. విద్య, వైద్యంతో పాటు వ్యవసాయ రంగానికి మహిళాభివృద్ధికి పెద్ద పీట వేసిన సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు దబ్బుకూటి ఏడుకొండలు, కాగిత కరుణకుమారి, ఎంపీపీ యారం వనజ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు బ్రహ్మరథం

రేపల్లె: రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు అడగడుగునా బ్రహ్మరథం పడుతున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. పట్టణంలోని 8, 11వ వార్డుల పరిధిలోని గరికపాటివారి వీధిలోని సచివాలయ కార్యాలయం ఆవరణంలో మంగళవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. సంక్షేమ పథకాలను దిగ్విజయంగా అమలు చేసి, పేదలకు ఆర్థిక భద్రత, భరోసా కల్పించే దిశగా జగనన్న అడుగులు వేస్తున్నారన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో సైతం వలంటీరు దళం అందించిన సేవలు ఎనలేనివన్నారు. సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధితో ముందుకు వెళ్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా వార్డుల్లో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బొలిశెట్టి సత్యనారాయణ, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు, కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం ధ్యేయం

రేపల్లె రూరల్: పేదల ముంగిళ్లల్లో నవరత్న కాంతులు వెదజల్లుతూ.. వారి జీవనంలో వెలుగులు



రేపల్లె పట్టణంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ

నింపేందుకు నిత్యం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మండలి అంజయ్య అన్నారు. మోర్లవారిపాలెం సచివాలయ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రతి ఒక్కరికి ఆర్థిక భద్రత కల్పించారన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల సంక్షేమ క్యాలెండర్‌లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, సర్పంచ్ యార్లగడ్డ లక్ష్మీతిరుపతమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు బొర్రా శ్రీనివాసరావు, కనపర్తి రవికిరణ్, కాగితాల కృష్ణకిషోర్, తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాల్లో ఆర్థిక ప్రగతి

కొల్లూరు : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కారణంగా వెనుకబడిన వర్గాల్లో ఆర్థిక ప్రగతి సాధ్యపడిందని కొల్లూరు వైస్ ఎంపీపీ మురాల రాంబాబు అన్నారు. మంగళవారం జువ్వలపాలెం సచివాలయం వద్ద 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జువ్వలపాలెం, తడికలపూడి గ్రామాలలోని లబ్ధిదారుల ఖాతాలకు ప్రభుత్వం రూ. 24.13 కోట్లు సంక్షేమ పథకాల రూపంలో జమ చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తడికలపూడి సర్పంచి సూరపనేని వెంకటేశ్వరరావు, జువ్వలపాలెం ఎంపీటీసీ సభ్యుడు గుంటూరు రామారావు, ఈఓపీఆర్డీ రవిబాబు, పంచాయతీ కార్యదర్శి షరీఫ్ పాల్గొన్నారు.

రూ. 33.92 కోట్ల సంక్షేమ లబ్ధి

ఓలేరు(భట్టిప్రోలు): పల్లెకోన సచివాలయం పరిధిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సర్పంచ్ బొల్లెద్దు రాజమ్మ ప్రతాప్ అధక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన కూడలిలో



జువ్వలపాలెంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



పెనుమర్రులో ప్రచారం చేస్తున్న నాయకులు

వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలో నవరత్నాల లబ్ధిదారుల డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. ఈ సచివాలయం పరిధిలో నవరత్నాల్లో భాగంగా డీబీటీ రూపేణా రూ. 33.92 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందినట్లు ఈవోపీఆర్డీ, నోడల్ ఆఫీసర్ టి. ఊహారాణి, తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, రాచూరు సర్పంచ్ జయవరపు రాధాకృష్ణమూర్తి, వైఎస్సార్ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు దున్నా తిరుపతిబాబు, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే జిలానీ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెదలంకలో..

భట్టిప్రోలు: పెదలంక సచివాలయంలో బుధవారం సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

పెనుమర్రులో..

పెనుమర్రు(వేమూరు): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను సచివాలయాల వద్ద ప్రదర్శించడం పారదర్శకత కోసమేనని గ్రామ సర్పంచ్ కొక్కిల గడ్డ సుమతి అన్నారు. మండలంలోని పెనుమర్రు గ్రామ సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహన్, సర్పంచ్ పిల్లి సామ్రాజ్యం, దాది సుబ్బారావు, బొల్లిముంత ఏడుకొండలు, వలంటీర్లు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చిన జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి

చందోలు(కర్లపాలెం): ఎన్నికల హామీలను 98 శాతం అమలు చేసిన సీఎం వైస్ జగన్ మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కావాలని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. పిట్టలవానిపాలెం మండలంలోని చందోలు-2 గ్రామ సచివాలయం వద్ద జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో కోన రఘుపతి మాట్లాడుతూ కరోనా కష్ట కాలంలోనూ సంక్షేమ పకాలను అమలు చేసినట్లు తెలిపారు. మేలు చేసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా నిలిచి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్కె బాజీ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఉయ్యూరు లీలా శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు డి.సీతారామరాజు,



చందోలు సచివాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

సీహెచ్ కృపానందం, ఏపీ రహదారుల కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, ఎంపీడీవో మారుతీ శేషమాంబ, పార్టీ నాయకులు మునీర్, కరీమున్నీసా పాల్గొన్నారు.

కుల గణన సక్రమంగా నిర్వహించాలి

డీపీఓ దాసరి రాంబాబు

కర్లపాలెం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని బాపట్ల డీపీవో, కర్లపాలెం ఎంపీడీవో దాసరి రాంబాబు అన్నారు. స్థానిక ప్రజా మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎనిమిది గ్రామ సచివాలయాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లకు కుల గణనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో కుల గణనకు సంబంధించిన తప్పులు లేకుండా సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. ప్రజల కులం వివరాలతో పాటు ఆర్థిక, సామాజిక స్థితిగతులను, విద్యా, ఆర్థిక వివరాలను యాప్‌లో పొందుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కేశవ నారాయణరావు, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు తదితరులు ఉన్నారు.

గోప్యంగా కుల గణన సమాచారం

భట్టిప్రోలు: ప్రతి గ్రామంలోను సచివాలయ సిబ్బంది ద్వారా నిర్వహించే సమగ్ర కులగణన సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు తెలిపారు. మంగళవారం మండలంలోని కోనేటిపురం, పల్లెకోన సచివాలయ సిబ్బందికి కోనేటిపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, గొరిగపూడి, ఓలేరు, పెదపూడి గ్రామాలకు గొరిగపూడి కమ్యూనిటి హాల్‌లో, పెదపులివర్రుకు ఆ గ్రామ సచివాలయంలో కుల గణన కార్యక్రమపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కులగణన సమర్థవంతంగా నిర్వహించాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ రాంబాబు



కొల్లూరులో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ

దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అడిగోపుల చిన వెంకటేష్‌బాబు సిబ్బందికి సూచనలు, సలహాలు అందించి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుల గణనలో పారదర్శకత ముఖ్యం

కొల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సామాజిక, ఆర్థిక కుల గణన పారదర్శకంగా నిర్వహించాలని కొల్లూరు ఎంపీడీఓ ఐ. సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో కొల్లూరు-2, చిలుమూరు, ఈపూరు లంక, క్రాప, చినపులివర్రు సచివాలయ పరిధిలోని సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లకు అవగాహన కార్యక్రమం కల్పించారు. కుల గణన పై వలంటీర్లు, సిబ్బంది ప్రజలందరకీ అవగాహన కల్పించాలని సూచించారు.

రేపు వెంకటకృష్ణాపురంలో బజరంగ్ నేత్రజ్యోతి

పెదకాకాని: బజరంగ్ ఫౌండేషన్ సామాజిక సేవా పరంపర కొనసాగిస్తూ నేత్ర జ్యోతి పేరుతో అంధత్వ సమస్య నివారణకు గ్రామీణ ప్రాంతాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. పెదకాకాని మండలంలోని వెంకటకృష్ణాపురం, దేవరాయబొట్లవారిపాలెం గ్రామాల్లో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన నేత్ర జ్యోతి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరం ద్వారా కంటి సమస్య ఉందని గుర్తించిన వారికి 7 రోజుల్లోగా కళ్ల జోళ్లు అందిస్తున్నట్లు అంబటి తెలియజేశారు.


తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: తైక్వాండో చాంపియన్‌షిప్‌లో స్టెమ్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ భరత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం విద్యానగర్‌లోని స్టెమ్ స్కూల్లో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో భరత్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 18,19వ తేదీల్లో తెనాలిలోని జేఎంజే కళాశాలలో జరిగిన 41వ సబ్ జూనియర్ ఆరో కాడిట్ ఇంటర్ జిల్లాస్థాయి తైక్వాండో చాంపియన్ షిప్-23 బాలికల విభాగంలో ఎస్‌కే సన రజత పతకం, కాడిట్ బాలికల విభాగంలో సీహెచ్ తనీష, ఎం.అక్షర కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు. అదేవిధంగా కాడిట్ బాలుర విభాగంలో పి.శశినిఖిల్, షేక్ అబ్దుల్ లుక్మన్ కాంస్య పతకాలు పొందారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు విద్యతో పాటు క్రీడలు, ఆత్మరక్షణకు సంబంధించిన కరాటే, తైక్వాండో సాధన చేయడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయశీల, ఉపాధ్యాయులు రమాదేవి, మోనికా పాల్గొన్నారు.

తగిన అనుమతులతోనే ప్రైవేటు వెంచర్లు

- నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటాం
- నగర కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రైవేట్ వెంచర్లు, లే అవుట్లు తగిన అనుమతులతోనే ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే పట్టణ ప్రణాళిక అధికారులు తొలగింపు చర్యలు తీసుకుంటారని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం వాసవి నగర్‌లో అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న లే అవుట్, శ్రీనగర్‌లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసిన అపార్ట్మెంట్‌లను తనిఖీ చేసి తదుపరి అనుమతులపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వెంచర్లు అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తే సంబంధిత ప్లానింగ్ కార్యదర్శి, పట్టణ ప్రణాళిక అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంచర్ల రోడ్ వైడెనింగ్ పోర్షన్, అంతర్గత రోడ్ల వెడల్పు, ప్లాట్ల కొలతలు, మార్ట్ గేజ్ ప్లాట్లు, యుటిలిటీ ఏరియా, ఎమినిటీస్ ఏరియా, ఓపెన్ స్పేస్, గ్రీనరీ, డ్రైన్ల ఏర్పాటుపై వివరాలు అడిగి తెలుసుకొని నేరుగా తనిఖీ చేశారు. అనంతరం పట్టణ ప్రణాళిక అధికారులతో కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకే వెంచర్లకు అనుమతులు ఇవ్వాలని, తుది అనుమతుల కోసం తమకు పంపే ముందే ప్రణాళిక అధికారులు సదరు వెంచర్ లను సమగ్రంగా పరిశీలించి, ప్రభుత్వ నిర్దేశిత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



వెంచర్ పత్రాలను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి

నిబంధనల మేరకు లేని వెంచర్లకు అనుమతులు మంజూరు చేయబోమన్నారు. అనంతరం శ్రీనగర్‌లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాన్ని పరిశీలించి, మాట్లాడుతూ నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పర్యటనలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, టీపీబీఓ రసూల్, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి

నరేంద్ర రామానుజ దాస స్వామీజీ

చెరుకుపల్లి: సనాతన ధర్మానికి మించిన ధర్మం లేదని రామాయణం మహాభారతం, వేదాలు, ఉపనిషత్తులు హిందూ ధర్మానికి మార్గదర్శకాలని శరణాగతి గోష్టి పీఠాధిపతులు శ్రీ నరేంద్ర రామానుజ దాస స్వామీజీ అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం మండల హిందూ ధర్మ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ మండల కన్వీనర్ పొన్నపల్లి సత్యన్నారాయణ అధ్యక్షతన పరుశురాం బ్రాహ్మణ సేవా సమితి మండలాధ్యక్షుడు రావూరి అంజనేయులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు, సందర్భంగా నరేంద్ర రామానుజదాస స్వామీజీ మాట్లాడుతూ ప్రపంచంలోని అన్ని మతాల కంటే హిందూ మతం చాలా గొప్పదని, ప్రతి ఒక్కరికి ముక్తి, మోక్షం ఈ ధర్మంలో మాత్రమే ఉందన్నారు. కట్టు బొట్టు సాంప్రదాయలాలు సిరి సంపదలని వీటికి భారతీయులు ఎవరూ దూరం కాకూడదని హితవు పలికారు. అనంతరం రాష్ట్ర ధర్మ ప్రచారకులు మొద్దు సాయిరాం మాట్లాడుతూ సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని



శోభాయాత్రలో పాల్గొన్న నరేంద్ర రామానుజ దాస స్వామీజీ, భక్తులు

ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార వాడల్లో ఇప్పటి వరకు 820 దేవాలయాలు నిర్మాణం చేసి, సామూహిక హారతులు, హిందూ సమ్మేళనాలు ఇంటింట ధర్మ ప్రచారంతో హిందూ ధర్మ రక్షణకు పాటు పడుతున్నామన్నారు. అనంతరం గ్రామ పుర వీధుల్లో భారత్ మాతాకీ జై, జైశ్రీరాం.. హిందూ ధర్మం వర్ధిలాలి అంటూ భక్తుల కోలాట నృత్యాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండారు జ్వాల నరసింహ, బొలగాని విజయలక్ష్మి, ఆలపాటి సుధారాణి, పడమట వెంకటేశ్వరరావు, ఉప్పు సాంబశివరావు, జంజనం హేమ శంకరరావు, చింతల మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా కేదార్‌నాథ్



కొల్లిపర: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ గుంటూరు జిల్లా కార్యదర్శిగా తూములూరు గ్రామం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుర్రా వి.కేదార్‌నాథ్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం మండలంలోని వివిధ పాఠశాల ఉపాధ్యాయులు ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా కేదార్‌నాథ్ మాట్లాడుతూ ఆదివారం యూటీఎఫ్ 49వ జిల్లా కౌన్సిల్ సమావేశాలు పొన్నూరు పట్టణంలోని జేఎంఆర్ ఫంక్షన్ హాల్ నందు జరిగాయని ఆ సమావేశంలో తనను ఎన్నుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, యూటీఎఫ్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాని తెలిపారు. జిల్లా కోశాధికారి షమ జుడ్డీన్‌దౌలా, యూటీఎఫ్ మండలాధ్యక్షుడు శివశంకర్, ప్రధాన కార్యదర్శి కాలేషావలి, గౌరవాధ్యక్షులు రామకృష్ణప్రసాద్, సీనియర్ నాయకులు మృత్యుంజయరావు, భూపతినాయుడు, వరప్రతాప్‌కుమార్, చింతయ్య, తోటి ఉపాధ్యాయలు అభినందనలు తెలిపారు.

కార్తికమాసం ప్రత్యేక పూజలు

బాపట్ల అర్బన్: బాపట్ల ఎస్ఎన్‌పీ అగ్రహారం శ్రీ గంగాపర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం, మంగళవారం ప్రాతఃకాల అభిషేక అనంతరం ఆలయ అర్చకులు కొల్లిపర వెంకట శివ వరప్రసాద్ స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు సహార్చకులు గూడూరు చిట్టిబాబు, పంగులూరి కౌండిన్య, నెమలికంటి హనుమంతరావు, ఆలయ ధర్మకర్త ఆదూరి హరినారాయణ, ఆదూరి గోపాలకృష్ణ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పర్యవేక్షించారు. భక్తులు ప్రత్యేక పూజలు, దీపారాధన చేశారు.



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

గణిత ఆణిముత్యం చంద్రశేఖరన్

బాపట్ల అర్బన్: అంతర్జాతీయంగా గణిత శాస్త్రాన్ని సుసంపన్నం చేసిన వారిలో అగ్రగణ్యుడు కొమరవోలు చంద్రశేఖరన్ అని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబా అన్నారు. కొమరవోలు చంద్రశేఖరన్ జయంతి సందర్భంగా మంగళవారం పురపాలక ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈసందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ బాపట్ల వాసిగా, భారతీయుడిగా గణితశాస్త్రాన్ని సంపదత్వం చేశారన్నారు. అంతర్జాతీయ గణిత శాస్త్ర యూనియన్‌కు అధ్యక్షుడిగా పనిచేశారని చెప్పారు. ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్తగా ఖ్యాతికెక్కారని కొనియాడారు. శాంతి స్వరూప్ భట్నగర్



చంద్రశేఖరన్ చిత్రపటానికి నివాళి

అవార్డును, రామానుజం మెడల్‌ను అందుకున్నారన్నారు. బాపట్ల బోర్డు స్కూల్లో ఆయన విద్యాభ్యాసం చేయడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాజశ్రీ, ఉపాధ్యాయులు అడే బుజ్జి, రమేష్, సాయి, కృష్ణనారాయణ, రంగా రెడ్డి, షేక్ ఘన్ సైదా, న్విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలు పక్కాగా రూపొందించాలి

జేసీ రాజకుమారి

మంగళగిరి: ఓటర్ల జాబితాలను పక్కాగా రూపొందించాలని కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జాయింట్ కలెక్టర్ బి. రాజకుమారి ఆదేశించారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో ఓటర్ల జాబితాలపై అధికారులతో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పులుపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని కోరారు. బీఎల్ఓలతో ఎప్పటికప్పుడు జాబితాలపై చర్చించి ఎలాంటి తప్పులు లేకుండా జాబితాలను రూపొందించాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసినప్పుడు ప్రజలందరికి తెలిసేలా ప్రచారం నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రజలు తమ పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించిన సమయంలో తమ ఓటును సరి చూసుకోవడంతో పాటు తప్పులుంటే బీఎల్ఓ దృష్టికి తీసుకెళ్లి సరిచేయించుకోవాలని కోరారు. 18 సంవత్సారాలు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటును నమోదు చేసుకోవాలని వివరించారు. ఓటర్ల జాబితాల మార్పులు చేర్పులపై ఎప్పటికప్పుడు ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించడంతో పాటు అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ నిర్మల్ కుమార్, ఎలక్టోరల్ ఆఫీసర్ లక్ష్మీకుమారి, అసిస్టెంట్ ఎలక్టోరల్ ఆఫీసర్, నగర అడిషనల్ కమిషనర్ కె.హేమామాలిని, డెప్యూటీ కమిషనర్ బి.శివారెడ్డి, మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల తహసీల్దార్లు జీవీ రామ్‌ప్రసాద్, నాగిరెడ్డి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

మందుబాబులపై కేసులు



తెనాలిరూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారికి రూరల్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి, కేసులు నమోదు చేశారు. తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామ సమీపంలో, తెనాలి నుంచి బాపట్ల చినపరిమి వెళ్లే డొంక రోడ్డులో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ఆరుగురిని రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు మంగళవారం రాత్రి గుర్తించారు. వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు కేసులు నమోదు చేశారు.